## బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చల్లా దంపతులు


పరకాలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పరకాల, అక్టోబర్ 22 : పరకాల పట్టణంలోని పశువుల సంతలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్లే చల్లా ధర్మారెడ్డి దంపతులు బతుకమ్మను పేర్చారు. అనంతరం పశువుల సంతలో స్థానిక మహిళలతో కలిసి సద్దుల బతుకమ్మ పండుగలో పాల్గొన్నారు. ఓటు ఆవశ్యకతను తెలియజేస్తూ పేర్చిన బతుకమ్మ ప్రత్యేక ఆకర్శణగా నిలిచింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితారామకృష్ణ, మహిళా కౌన్సిలర్లు పాల్గొన్నారు.


శాయంపేట : బతుకమ్మలతో వెళ్తున్న మహిళలు, యువతులు


గీసుగొండలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ఆత్మకూరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


నడికూడ: బతుకమ్మ వేడుకల్లో మహిళలు


నడికూడ: బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

# ఊరూరా పూల సింగిడి

- కనుల పండువగా సద్దుల బతుకమ్మ వేడుకలు
- తెలంగాణ సంస్కృతీసంప్రదాయం ఉట్టిపడేలా పండుగ
- ఉత్సాహంగా ఆడిపాడిన ఆడపడుచులు
- నిమజ్జనంతో ముగిసిన పూల జాతర


దామెర : పులుకుర్తిలో సద్దుల బతుకమ్మతో మహిళలు

శాయంపేట/దామెర/గీసుగొండ/ఆత్మకూరు/నడికూడ, అక్టోబర్ 22 : సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. అడపడుచులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. గౌరీ దేవికి పూజల అనంతరం బతుకమ్మలతో చెరువుల వద్దకు వెళ్లి ఆడిపాడారు. ఆయా గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చెరువుల వద్ద లైట్లను ఏర్పాటు చేసి బతుకమ్మలను సిబ్బందితో చెరువుల్లో వేయించారు. శాయంపేటలో ఎస్సై దేవేందర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దామెర మండలంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు జరిగాయి. దామెరలో జడ్పీటీసీ కల్పన, పులుకూర్తి, కోగిల్వాయిలో ఎంపీటీసీలు గోవిందు సంధ్యాఅశోక్, సంగనబోయిన మౌనికాకిరణ్, ఓగులాపురం, దమ్మన్నపేట, వెంకటాపురం, ల్యాదెళ్ల, సింగరాజుపల్లి, దుర్గంపేటలో సర్పంచులు కేతిపల్లి సరోజనారెడ్డి, పుల్యాల రాణి రఘుపతిరెడ్డి, పున్నం రజితాసంపత్, కుక్క శ్రావణ్యాఅనీల్, ఉప్పుల రజిత, యాదా రాజేశ్వరీఈశ్వర్ వేడుకల్లో పాల్గొని బతుకమ్మ పాటలు పాడి గౌరమ్మకు పూజలు చేసి సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఎంపీపీ కాగితాల శంకర్, వైస్‌ఎంపీపీ జాకీర్‌అలీ, సర్పంచులు గట్ల విష్ణువర్ధన్‌రెడ్డి, గోగుల సత్యనారాయణరెడ్డి, మేడిపల్లి సాంబయ్య, గోవిందు అశోక్, తుత్తురు శ్రీనివాస్, శ్రీరాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు, డైరెక్టర్స్ గుండా చంద్రమోహన్, దుబాసి అనీల్, మండల కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్‌అక్తర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండు రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి ముదిగొండ కృష్ణమూర్తి, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు మెంతల రాజు పాల్గొన్నారు.

గీసుగొండ మండలంతోపాటు గ్రేటర్ వరంగల్ 15,16వ డివిజన్‌లలో ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో, బొడ్రాయి వద్ద మహిళలంతా ఒక దగ్గరి చేరి బతుకమ్మ వేడుకలను జరుపుకున్నారు. 16వ డివిజన్ కట్టమల్లన్న చెరువు వద్ద బతుకమ్మ వేడుకల కోసం మున్సిపల్ అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ఆత్మకూరు మండలంలోని అన్ని గ్రామాలల్లో ఆదివారం మహిళలు సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అన్ని గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీఐ రవిరాజు ఆధ్వర్యంలో చెరువు వద్ద బందోబస్తును నిర్వహించారు. నడికూడ మండలంలోని అన్ని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో సర్పంచ్ ఊర రవీందర్ రావు, పార్టీ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి డప్పు చప్పుళ్లతో బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. ఎంపీపీ మచ్చ అనసూర్య రవీందర్, ఆయా గ్రామాల సర్పంచులు తిప్పర్తి సాంబశివారెడ్డి, పాలకుర్తి సదానందం, సాధు నిర్మల సమ్మిరెడ్డి, శనిగరపు నీల సమ్మయ్య, పెండ్లి రాజు, గూడెం కృష్ణమూర్తి, బొట్ల సంధ్య రవి, మేకల రమేశ్ పాల్గొన్నారు.

## 'ఓటు హక్కును వినియోగించుకోవాలి'

పరకాల, అక్టోబర్ 22 : రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఏసీపీ కిశోర్‌కుమార్ తెలిపారు. పట్టణంలో ఆదివారం కేంద్ర బలగాలతో ప్రధాన రహదారులపై కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ జూపల్లి వెంకటరత్నం, ఎస్సైలు బొజ్జం రవీందర్, శివకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


కేంద్రబలగాల కవాతులో పాల్గొన్న ఏసీపీ కిశోర్‌కుమార్

## కాకతీయుల త్రికూటాలయం అద్భుతం

### పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్‌ఝా

శాయంపేట, అక్టోబర్ 22 : కాకతీయులు నిర్మించిన త్రికూటాలయం అద్భుతమని నగర పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్‌ఝా తెలిపారు. మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలోని పురాతన శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానాన్ని ప్రధాన అర్చకులు అనుదీప్‌శర్మ ఆహ్వానం మేరకు వరంగల్ నగర పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్‌ఝా శనివారం రాత్రి కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయ అర్చకుడు అనుదీప్ శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాళికాదేవిని దర్శించుకుని చండీ హోమంలో పాల్గొన్నారు. అర్చకులు వేద ఆశీర్వచనం మహా ప్రసాదాలు అందజేశారు. సీపీ మాట్లాడుతూ కాకతీయుల కళా వైభవం ఎంతో గొప్పదన్నారు. ఇలాంటి దేవాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్, శాయంపేట ఎస్సై దేవేందర్, సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి, తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్, ఇమ్మడిశెట్టి రవీందర్, కోత్వాలు కిరణ్, సవాసి రమేశ్, వావిలాల రాజేందర్, మోహన్, సాయి, జయపాల్‌రెడ్డి, భాను, అమ్మ రవి, కోగిల రవీందర్ పాల్గొన్నారు.


రాజరాజేశ్వర ఆలయంలో సీపీ అంబర్‌కిశోర్‌ఝా

## మతిస్థిమితం లేని వ్యక్తిని కాపాడిన పోలీసులు


కుటుంబ సభ్యులతో మతిస్థిమితంలేని వ్యక్తి

సంగెం, అక్టోబర్ 22 : మతిస్థిమితం లేని వ్యక్తి రైల్వేట్రాక్ వద్ద వెళ్తుండగా ప్రమాదం నుంచి పోలీసులు కాపాడిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి ఎస్సై ఎం భరత్ తెలిపిన ప్రకారం.. మండలంలోని చింతలపల్లి రైల్వేగేట్ నుంచి టెక్స్‌టైల్ పార్కు వెళ్లే దారిలో రైల్వేట్రాక్ పోల్‌నంబర్ 390/సి7 వద్ద గుర్తు తెలియని వ్యక్తి వెళ్తుండగా స్థానికులు గమనించి సంగెం పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో వెంటనే ఎస్సై భరత్ ఇద్దరు కానిస్టేబుళ్లను ఘటనా స్థలానికి పంపించగా వారు రైల్వే ట్రాక్ వద్ద ఉన్న వ్యక్తిని ప్రమాదం నుంచి కాపాడి పోలీసుస్టేషన్‌కు తీసుకవచ్చారు. వివరాలు సేకరించటంతో మహబూబాబాద్ మండలంలోని నడివాడ గ్రామానికి చెందిన వాసినేని నగేశ్‌గా గుర్తించారు. ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ఆయన భార్య రేవతి, మామ వేణుకు అప్పగించినట్టు ఎస్సై భరత్ తెలిపారు. సకాలంలో స్పందించి వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులను ప్రజలు అభినందించారు.